పత్రికాప్రకటన                                                              కాకినాడ, 21.8.2018

జిల్లాలో గోదావరి వరద ముంపుకు లోనైన ప్రాంతాలలో 32 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 3,175 మంది ప్రజలకు ఆశ్రయం కల్పించామని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు.

మంగళవారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామదర్శిని, వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజాభిప్రాయం, సంతృప్తి, వివిధ శాఖల ద్వారా పనితీరు సూచికల సాధన, గోదావరి వరద సహాయక చర్యలు, స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే, సీజనల్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా పాల్గొని ఆయా అంశాలలో జిల్లా ప్రగతిని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి వరద కారణంగా 17 వేల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు ప్రభావితమైయ్యాయని తెలియజేశారు. అలాగే 1092 గృహాలకు, 3 రహదార్లకు నష్టం వాటిల్లిందన్నారు. వరద ముంపుకు లోనైన ప్రాంతాలలో ప్రభావిత ప్రజల కొరకు 32 సహాయ,పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, 3,175 మంది ముంపు నిర్వాసితులను ఈ కేంద్రాలకు తరలించి ఆహారం, త్రాగునీరు, ఇతర అవసరాలను కల్పించామని తెలియజేశారు. గోదావరి వరద ప్రవాహం తగ్గు ముఖం పట్టిందని, అయినప్పటికీ ముందు జాగ్రత్త కొరకు పునరావాస కేంద్రాలను మరో రెండు, మూడు రోజుల పాటు కొనసాగిస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ సమీక్షలో జిల్లాలో ఈ ఖరీఫ్ సాగు కొరకు ఇప్పటి వరకూ 764 కోట్లు పంటరుణాలు కల్పించామని, 97 శాతం కౌలు రైతులు రుణాలు పొందారన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలలో త్రాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సదుపాయాలను కల్పిస్తున్నామని, నెల రోజుల్లో అన్నిటికీ ఈ వసతుల ఏర్పాటు పూర్తి చేస్తామని తెలియజేశారు. రాజమండ్రి నగరంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు తొలుత ప్రతిపాదించిన స్థలానికి ప్రత్యామ్నాయంగా ఇరిగేషన్ శాఖ దూరంగా మరొక చోట స్థలం సూచించిందని, ఈ మార్పు వల్ల నిర్మాణం వ్యయం 6 కోట్ల మేరకు పెరుగుతోందని ముఖ్యమంత్రికి తెలియజేశారు. జనావాసాల మధ్య ఉండటం వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్యేశ్యంతో ఈ మార్పు సూచించామని ఇరిగేషన్ అధికారులు తెలుపగా, అత్యాధునిక టెక్నాలజీతో నిర్మిస్తే ఇబ్బంది ఉండదని, తొలుత గుర్తించిన స్థలంలోనే ఎస్‌టిపి పనులు వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గోదావరి వరద పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎటువంటి ఆపద లేకుండా చూడాలని, నష్టాల సర్వే నిర్వహించి పరిహారాలను సత్వరం పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్‌కు సూచించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.మల్లికార్జున, ఇన్‌చార్జి డిఆర్‌ఓ యం.జ్యోతి, డ్వామా పిడి బి.రాజకుమారి, డిపిఓ ఆనంద్, జడ్‌పి సిఈఓ విద్యాసాగర్, సిపిఓ రత్నబాబు, హౌసింగ్ పిడి జివి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ).